క్లుప్తంగా

ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ లీలా

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని సాయివినీత్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, విశ్రాంత డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ కె.లీలా అన్నారు. పూండీ సాయివినీత్ కాలేజీలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆమె మాట్లాడారు. పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడం వలన సమాజంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కోదండరావు, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బత్తిని శ్రీను, అధ్యాపకులు బచ్చలి ధర్మారావు, జి.సాయి గోపాల్, షణ్ముఖరావు, రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

కంచిలి: మండల కేంద్రంలోని ఎస్.ఆర్.సి.పురం, కంచిలి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో మెయిన్‌రోడ్డు డ్రైనేజీలో పూడికతీత పనులను రెండు రోజులు చేపట్టారు. జేసీబీతో పనులు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ డొక్కర తులసీ బలరాం, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్టారావు పనులను పరిశీలించారు.

60 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్డీవో వెంకటేష్

పలాస: పలాస–కాశీబుగ్గ లయన్స్‌క్లబ్, ప్రాణదాత బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కాశీబుగ్గ కన్యకాపరమేశ్వరి ఆలయంలో రక్తదాన శిబిరం జరిగింది. 60 మంది యువకులతో పాటు పలాస ఆర్డీవో జి.వెంకటేష్ రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. వైశ్య సంఘ అధ్యక్షుడు కోట్ని దుర్గాప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు తూముల శ్రీనివాసరావు, మల్లా మనిల్, బోయిన తరుణ్, బోయిన్ విజయ్, కిల్లంశెట్టి రాజేంద్ర, రామక్రిష్ణ ఉన్నారు.


యాదవకుల ఉన్నతికి కృషి



నూతన కార్యవర్గంతో ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం: యాదవ సామాజికవర్గం ఉన్నతికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం యాదవ కుల పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సేవాదళం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షులుగా మురపాల లక్ష్మి, ఉపాధ్యక్షులుగా కోట రాజుతోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ నాయకులు నర్తు నరేంద్ర, డాక్టర్ ఉలాల కోదండరాము, దాసరి రాజు, నర్తు ప్రేమ్ పాల్గొన్నారు.


పిల్లలను బడికి పంపించాలి



పిల్లలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు రూరల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాసటగా నిలవాలని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలగాన హేమారావు అన్నారు. నువ్వలరేవులో తోటి ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా.. పాఠశాలకు సరిగా హాజరుకాని విద్యార్థుల ఇళ్లను సందర్శించి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకున్నారు. చిన్నారులకు మంచి భవిష్యత్ కల్పించాలంటే తల్లిదండ్రుల తోడ్పాటు అవసరమన్నారు. ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ బమ్మిడి లక్ష్మీపతి ఉన్నారు.

నీటి వినియోగంపై అవగాహన



కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది

కంచిలి: నీటి వనరుల వినియోగంపై విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరమని మఠం సరియాపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ అన్నారు. నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నీటి వనరుల ప్రాముఖ్యతను, గృహ, వ్యవసాయ అవసరాలు, నీటి పొదుపు, వినియోగం గురించి వివరించారు. డ్రిప్, బిందు సేద్యం పద్ధతుల ద్వారా తక్కువ నీటి వనరులతో ఎక్కువ పంటను పండించే నూతన విధానాలను తెలియజేశారు.

మండలాల వారీగా మొత్తం రైతులు.. పథకం అందిన వారు..

మండలం	మొత్తం రైతులు	అన్నదాత సుఖీభవ అందుకున్న వారు
టెక్కలి	10,852	8,213
కోటబొమ్మాళి	12,886	11,738
నందిగాం	15,149	10,427
సంతబొమ్మాళి	14,417	11,583



అన్నదాతకు కోత!

- అర్హులకు అందని అన్నదాత సుఖీభవ సాయం
- టెక్కలి నియోజకవర్గంలో 11,343 మందికి మొండిచేయి

టెక్కలి: రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవం పథకం ద్వారా ఏటా 20 వేల రూపాయలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టిన మొదటి ఏడాది ఎటువంటి సాయం అందజేయలేదు. రెండో ఏడాది కేవలం ఐదు వేల రూపాయలు అందజేసి చేతులు దులుపుకున్నారు. కంటి తుడుపు చర్యగా అందజేసిన రూ. ఐదు వేలు సాయం సైతం మొత్తం రైతులకు అందజేయలేదు. టెక్కలి నియోజకవర్గంలో 53,304 మంది రైతులు ఉండగా 41,961 మంది రైతులకు మాత్రమే సాయం అందజేయగా మిగిలిన 11,343 మందికి మొండిచేయి చూపించారు. వారిలో పీఎం కిసాన్ అందుకున్న కొంతమంది రైతులకు అన్నదాత సుఖీభవ అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం అందని వారంతా వినతులు సమర్పించాలని ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఇచ్చారు. దీంతో ఇప్పటికే టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల నుంచి 692 మంది వినతులు సమర్పించారు. వారికి ఈ పథకం అందుతుందో లేదో అనేది సందిగ్ధత నెలకొంది.

- టెక్కలి మండలం తలగాం గ్రామానికి చెందిన శిగిలిపల్లి శ్రీనివాసరావుకు ఎకరా పైచిలుకు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందింది. ఇప్పుడు అన్నదాత సుఖీభవం అందలేదు. ఈయనకు పీఎం కిసాన్ సాయం అందింది.
- టెక్కలి మండలం చాకిపల్లి గ్రామానికి చెందిన పంగ సింహాచలం 1.20 సెంట్లు సాగు చేస్తున్నారు. ఈయనకు గతంలో రైతు భరోసా పథకం అందింది. ఇప్పుడు పీఎం కిసాన్ సాయం అందినప్పటికీ కూటమి ప్రభుత్వం మాత్రం అన్నదాత సుఖీభవం అందజేయలేదు.
- కోటబొమ్మాళి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన రైతు ముద్ద వేణుగోపాలరావు తొమ్మిది సెంట్లు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం అందింది. ఇప్పుడు అన్నదాత సుఖీభవ పథకం వర్తించలేదు.

అన్నదాత సుఖీభవ పేరుతో మోసం



అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు పెద్ద మోసం చేశారు. 20 వేల రూపాయలు సాయం అందజేస్తామని చెప్పి ఐదు వేల రూపాయలు మాత్రమే ఇచ్చారు. ఆ డబ్బులు కూడా అందరికీ ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు నిలువునా మోసం చేస్తున్నారు.

– బి.దివాకర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, టెక్కలి

రైతులను దగా చేశారు..



అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊకదంపుడు ప్రచారాలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత రూ. ఐదు ఇచ్చి దగా చేశారు. ఇటువంటి రైతు మోస పూరిత ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి.

– సత్తారు సత్యం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టెక్కలి

ఆలయ అభివృద్ధికి విరాళం



కంచిలి మండల కేంద్రంలో వెలసిన కంచమ్మతల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం ఎస్.ఆర్.సి.పురం గ్రామానికి చెందిన పాలిన హేమసుందరరావు, లోలమ్మ దంపతులు రూ. 60 వేలు విరాళాన్ని ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. – కంచిలి

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల ఉత్సవాలు



వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడులో మంకినమ్మ, సందెమ్మ అమ్మవార్ల ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. అమ్మవార్లకు భక్తుల ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. – వజ్రపుకొత్తూరు రూరల్

నూతన కార్యవర్గం ఎన్నిక



కంచిలి మండల శిష్టకరణ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక రాధాక్రిష్ణ ఆలయం ఆవరణలో ఆదివారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. గౌరవ అధ్యక్షులుగా జోగిమహంతి లక్ష్మీకాంతం, రఘుపాత్రుని మీనా, చక్రమహంతి బాబూరావు, సలహాదారులుగా శివాజీ పట్నాయక్, మనాపురం అప్పలనారాయణ, పాలవలస గోపి, అధ్యక్షునిగా బలివాడ కామేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా శాలిహుండం తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా నాని పట్నాయక్, కార్యదర్శిగా మురళీ పట్నాయక్, బలివాడ శ్రీనివాసరావు, ఉపకార్యదర్శిగా తరిణి పట్నాయక్, కోశాధికారిగా రుషి పట్నాయక్ ఎన్నికయ్యారు. – కంచిలి

మత్స్యకారుల దరి చేరని ఫ్రీ బస్సు



డొంకూరులో ప్రైవేటు బస్సు కోసం ఎదురు చూస్తున్న మత్స్యకార మహిళలు

ఇచ్ఛాపురం రూరల్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలు టిక్కెట్ లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చని చెబుతున్న కూటమి నాయకులు బస్సులు ఏప్రాంతాలకు సర్వీసులు అందిస్తున్నాయన్న విషయాన్ని గమనించాలని మత్స్యకార మహిళలు కోరుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో డొంకూరు, లక్ష్మీపురం, పీఎల్ పురం, కవిటి మండలంలోని కపాసుకుద్ది, పుక్కల్లపాలెం, సీహెచ్‌కేపాలెం, కొత్తపాలెం, పీకేపాలెం, ఇద్దివానిపాలెం, కళింగపట్నం, ఒంటూరు, సోంపేట మండలం ఇసుకలపాలెం మత్స్యకార గ్రామాలకు ఒక్క ఆర్టీసీ బస్సు కూడా వెళ్లడం లేదు. నియోజకవర్గంలో సుమారు పాతిక వేల మంది మత్స్యకార మహిళలకు ఉచిత బస్సు సేవలు అందడం లేదు. దీంతో వీరంతా అధిక ధరలు చెల్లించి ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట మహిళలకు ఫ్రీ బస్సు అని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తమకు ఈ సౌకర్యాన్ని కల్పించకుండా మోసం చేస్తుందని మత్స్యకార గ్రామ మహిళలు మండిపడుతున్నారు.

అసంపూర్తిగా టెక్కలి-చెట్లతాండ్ర రోడ్డు పనులు

- ప్రజలకు అవస్థలు



టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర రూట్‌లో కొంత వరకు వేసిన బీటీ రోడ్డు



రోడ్డు వేయకపోవడంతో గుంతలు దర్శనమిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర మార్గంలో అసంపూర్తి రోడ్డు పనులు అవస్థలకు గురి చేస్తున్నాయి. ఈ మార్గంలో రోడ్డు 30 అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేస్తామని చెప్పి ఏప్రిల్ నెలలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత జూలై నెలలో పనులు ప్రారంభించి ఇప్పటివరకూ కేవలం 24 అడుగుల మేరకు రోడ్డు పనులు చేపట్టారు. ఆ రోడ్డు పనులు సైతం పూర్తి చేయకపోవడంతో రాకపోకలు సాగించే వారంతా అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా 30 అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేస్తామంటూ అధికారులు హడావుడి చేసి ఇరువైపులా ఉన్నటువంటి నిర్మాణాలను కొలతల మేరకు తొలగించేశారు. ఇప్పుడు అసంపూర్తి పనులు చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం అసంపూర్తిగా చేపట్టిన పనులు సైతం కొన్ని చోట్ల పెచ్చులూడిపోతున్నాయి. హడావుడిగా..అసంపూర్తిగా..నాణ్యత లేకుండా చేసిన అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర రోడ్డు పనులపై పెద్ద ఎత్తున విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

పలాస: ఆశ వర్కర్లకు కనీసం వేతనాలు అమలు చేయాలని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాసలోని అక్షర కళాశాలలో ఆదివారం యూనియన్ సమావేశం జరిగింది. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన ఆశ కార్యకర్తలతో జరిగిన సమావేశంలోఆమె మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలాస మండల కమిటీ అధ్యక్షురాలుగా వై.హేమలత, కార్యదర్శిగా జి.జ్యోతి, వజ్రపుకొత్తూరు మండల కమిటీ అధ్యక్షురాలుగా బి.లక్ష్మి, కార్యదర్శిగా ఎస్.రమణమ్మతోపాటు 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో జీవనోపాధి



నందిగాం: మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

నందిగాం: తేనెటీగల పెంపకం ద్వారా రైతులు స్థిరమైన జీవనోపాధి పొందవచ్చని హంబుల్ బీ సంస్థ ప్రతినిధి ప్రభాకరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో తెనెటీగల పెంపకంపై మహిళా రైతులకు ఆదివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదారాబాద్ నుంచి హంబుల్ బీ సంస్థ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో తెనెటీగల పెంపకం వలన నాణ్యమైన తేనె ఉత్పత్తి అవుతోందన్నారు. తేనెటీగల పెంపకంపై తగిన శిక్షణతో పాటు నాణ్యతగల పెట్టెలు, తేనెటీగల కాలనీలు, పనిముట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం మనోరత్నం పాల్గొన్నారు.

- **వజ్రపుకొత్తూరు:** తేనెటీగల పెంపకం వలన కుటుంబ ఆదాయం పెరుగుతుందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో హంబుల్‌బీ సంస్థ సౌజన్యంతో మహిళా రైతులకు తనేటీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణప్రాంత మహిళా రైతులు అదనపు ఆదాయం కోసం తేనెటీగల పెంపకం చేపట్టాలని సూచించారు. కంపెనీ ప్రతినిధి ప్రభాకర్, ఏపీఎం ఈశ్వర్, సుజాత, పద్మావతి, సరస్వతి, చంద్రకళ, సౌజన్య పాల్గొన్నారు.

పలాసకు మూడు బార్లు మంజూరు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి మరో మూడు కొత్త బార్లు మంజూరయ్యాయని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన పలాస ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారులకు కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను వివరించారు. మద్యం సిండికేటు అధికారులను కలిసి మాట్లాడారు. జనరల్ కేటగిరీ కింద రెండు, సొండి కులానికి ఒక బారు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30న లాటరీ ద్వారా బార్ల కేటాయింపు ఉంటుందన్నారు.

శిథిలావస్థలో చారిత్రక ఆలయం!

- ఉనికి కోల్పోయిన రాధాకృష్ణ ఆలయం
- మాన్యాలున్నా ధూపదీప నైవేద్యాలకు నోచుకోని వైనం



పుడాభద్రలో శిథిలావస్థకు చేరిన రాధాకృష్ణ ఆలయం



గర్భగుడి బయట ఉన్న దేవతామూర్తుల విగ్రహాలు

కంచిలి: వందల ఏళ్ల చరిత్ర గల పురాతన ఆలయాలు పూర్తిగా నిరాదారణకు గురౌతున్నాయి. ఇందులో కంచిలి మండలంలోని పుడాభద్ర గ్రామంలో ఉన్న రాధాకృష్ణ ఆలయం కూడా ఈ కోవకే చెందుతుంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయం ధూపదీప నైవేద్యాలకు నోచుకోక పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆలయం పైకప్పు, గర్భగుడితో పాటు మిగతా భాగంలో పైకప్పు కూలిపోయింది. దీంతో దేవతామూర్తుల విగ్రహాలు గర్భగుడి నుంచి బయటకు వచ్చాయి. ఈ గ్రామం పూర్వం అగ్రహారంగా పిలువబడేది. ఇక్కడ గ్రామమంతటా పూర్తిగా బ్రాహ్మణ కుటుంబాలే నివసించేవారు. ఈ కుటుంబాలన్నీ రకరకాల కారణాలతో ఒక్కొక్కరుగా గ్రామం నుంచి వలస వెళ్లిపోయారు. కానీ వారికి చెందిన భూములన్నీ ఇక్కడ ఉండటంతో కౌలుకు అప్పగించారు. గ్రామంలో రాధాకృష్ణ ఆలయంతోపాటు స్వయంభూలింగంతో ఏర్పడిన శివాలయం కూడా ఉండేది. ఈ రెండు ఆలయాలు దేదీప్యమానంగా పూజలతో వర్ధిల్లేవి. రానురాను గ్రామంలో చోటుచేసుకొన్న పరిణామాలు, గ్రామస్తులంతా వలస వెళ్లడం వంటి కారణాల మూలంగా రెండు ఆలయాలు పూర్తిగా నిరాదారణకు గురయ్యాయి. ఇందులో రాధాకృష్ణ ఆలయం పైకప్పు కూలిపోవడంతో అక్కడి కార్యకలాపాలు ఆగిపోయాయి. కానీ శివాలయంలో మాత్రం అక్కడి అర్చకులు వంశపారంపర్యంగా జాగ్రత్తగా నిర్వహించడంతో మంచి ప్రాశస్త్యాన్ని సంపాదించింది.



ఆలయ శిఖరం పైకప్పు కూలి ఖాళీ ఏర్పడిన దృశ్యం



ఆలయం వెనుక గల కొలను

59 ఎకరాల మాన్యం..

ఇదిలా ఉండగా రాధాకృష్ణ ఆలయానికి 59 ఎకరాల మాన్యం భూములు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ భూములన్నీ స్థానిక రైతులు అనుభవిస్తూ ఆలయం ఇలా శిథిలావస్థకు చేరినా కూడా విడిచి పెట్టేయడంతో ధూపదీప నైవేద్యాలకు సైతం ఇక్కడ దేవతామూర్తుల విగ్రహాలు నోచుకోవడం లేదు. ఆలయం గోడలపై ఉన్న శిల్పకళా సంపదను పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆలయం వెనుక భాగంలో కొలను ఉంది. ఈ కొలను చుట్టూ అప్పట్లో మల్లెపూల మొక్కలు ఉండేవి. ఆలయంలో దేవతామూర్తులకు మల్లెపూలతోనే పూజించేవారు. ప్రస్తుతం ఈ కొలనులో నీళ్లు ఉన్నప్పటికీ అప్పటి పరిస్థితులేవీ సాక్షాత్కరించటం లేదు. ఇటువంటి ఆలయాలను కాపాడటానికి పురావస్తుశాఖ ఆసక్తి చూపిస్తున్నప్పటికీ ఇక్కడ ఈ ఆలయం ఉన్నట్లు వారి దృష్టికి వెళ్లకపోవడంతో ఇంతటి ప్రాసస్త్యం కలిగిన ఆలయాన్ని కాపాడలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆలయం మఠంసరియాపల్లి గ్రామంలోని రాధాకృష్ణ మఠం పరిధిలోనే పుడాభద్ర గ్రామంలో గల రాధాకృష్ణ ఆలయం కూడా ఉన్నప్పటికీ దేవదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ ఆలయం పరిస్థితిపై దేవదాయశాఖ, పురావస్తుశాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఇచ్ఛాపురం: ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కలిదిండి గ్రామంలో కాపునేత వంగవీటి మోహనరంగా విగ్రహంపై పేడ పూసిన దుండగులను అదుపులోనికి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక నేస్తం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కట్టా సూర్యప్రకాశారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటువంటి సంఘవిద్రోహ చర్యలకు పాల్పడితే సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

పలాస: గ్రామ, వార్డు స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస–కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి అన్నారు. మున్సిపాలిటీలోని 19వ వార్డులో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, యువజన కమిటీలను తక్షణమే ఎన్నుకోవాలన్నారు. అందుకు తగ్గ యువకులు ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పుడుకప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా వార్డు కమిటీ సభ్యులు పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బగాది సింహాచలం, కల్లేపల్లి కామేశ్వరరావు, సీపాన లోకేష్, పిట్ట భాస్కరరావు, దీర్ఘాసి గురయ్య, కొంచాడ సుధాకర్ ఉన్నారు.

27న అభయ గణపతి ఆలయ వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ సమీపంలోని నీలకంఠేశ్వర ఆలయం అవరణంలో నిర్మించిన అభయ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో పరిసర ప్రాంత భక్తులు పాల్గొని గణపతి అశీస్సులు పొందాలని కోరారు. ఉత్సవ నిర్వహణపై ఆదివారం కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చర్చించారు. సమావేశంలో బత్తిని తరిణయ్య, పువ్వల జోగారావు ఉన్నారు.

వంశధార కాలువ శుభ్రం



కాలువలో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని జగన్నాథ సాగరంలోకి వచ్చే వంశధార కాలువలో పూడికతీత పనులు ఆదివారం చేపట్టారు. ఎడమ కాలువ నుంచి పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరు వెళ్లేందుకు చెత్త పేరుకు పోవడంతో వాటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులను చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావు చెప్పారు. 30 మంది కార్మికులతో కాలువలో చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు.